సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో గురుకులాలు

- మహిళా సాధికారత.. ఆడబిడ్డల విద్యకు పూలే విధానాలే మార్గదర్శనం చేశాయి
- సకల కాలాల్లో సావిత్రీబాయి ఆదర్శం
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): సకల రంగాల్లో బహుజనులను కట్టడిచేసే సామాజిక, సంప్రదాయ నిర్బంధాలను బద్దలుకొట్టి స్త్రీ విద్య కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని బీఆర్ఎస్ పార్టీ అధినేత కే చంద్రశేఖర్‌రావు కొనియాడారు. చదువులతల్లి సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చేసిన సామాజిక కృషిని గుర్తుచేసుకున్నారు. స్త్రీ జాతి ఔన్నత్యం కోసం, అణచివేతకు గురైన కులాల స్వేచ్ఛ కోసం మహాత్మా జ్యోతారావు పూలే, సావిత్రీబాయి పూలే దంపతులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మెజారిటీ ప్రజల జీవన విధానం మరింత గుణాత్మకంగా మార్పు చెందడానికి, వారి హక్కులను కాపాడేందుకు, త్యాగాలు చేసిన భారతీయ మహనీయుల్లో పూలే దంపతులు ముందు వరుసలో ఉంటారని కొనియాడారు. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో దళిత, బహుజన వర్గాలను మరింత భాగస్వామ్యం చేసే దిశగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పదేండ్ల అనతికాలంలో కుదురుకున్నదని తెలిపారు. మహాత్మా పూలే దంపతుల ఆశయాలకు అనుగుణంగా చేపట్టిన నాటి బీఆర్ఎస్ కార్యాచరణ నేడు ఫలితాలు ఇస్తున్నదని గుర్తుచేశారు. దళిత, బహుజన వర్గాలకు పట్టుకొమ్మలైన పల్లె తెలంగాణ నేడు ప్రగతిపథంలో పయనిస్తూ భవిష్యత్ తరాలకు బంగారు బాటలు వేసిందని వివరించారు.

మహిళా సాధికారత కోసం...

గురుకుల విద్యతో సహా బడుగు వర్గాల బిడ్డలను భావితరాలకు ప్రతినిధులుగా తీర్చిదిద్దాలనే దార్శనికతతో విద్యారంగంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వేసిన పునాదిలో సావిత్రీబాయి పూలే దంపతుల ఆశయాలు ఇమిడి ఉన్నాయని కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రపంచస్థాయి నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవడానికి ప్రత్యేక గురుకులాలు, జూనియర్, డిగ్రీ కళాశాలలను స్థాపించామని గుర్తుచేశారు. మహిళా సాధికారత కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిందని వివరించారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ సబ్బండ వర్గాల్లో నిత్య చైతన్యాన్ని నింపడమే సావిత్రీబాయి పూలే వంటి మహనీయులకు మనం అందించే ఘన నివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

నిరంకుశ పాలనపై నిప్పురవ్వలమవుదాం

- మోసపూరిత కాంగ్రెస్‌పై పోరాట వెలుగులమవుదాం
- అరాచక హస్తం గద్దె దిగేదాకా అలుపెరుగని పోరాటమే
- పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ తుగ్లక్ విధానాలపై, నిరంకుశ పాలనపై, హామీలను ఎగవేసిన మోసపూరిత ప్రభుత్వ తీరుపై మన పోరాటం కొనసాగిద్దామని గులాబీ శ్రేణులకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. గత ఏడాది కాలంగా కాంగ్రెస్ సర్కార్ పాలనా వైఫల్యాలను ఎండగట్టిన పార్టీ శ్రేణులకు ఆయన నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా సందేశమిచ్చారు. 'ప్రాణ సమానులైన బీఆర్ఎస్ తోబుట్టువుల్లారా' అంటూ ప్రారంభించిన కేటీఆర్.. గత ఏడాదిపాటు చేసిన పోరాటాలను, నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తూనే రానున్న రోజుల్లోనూ మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించేదాకా పోరాటం కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఏడాది కాలంగా కాంగ్రెస్ నిరంకుశ పాలనపై గులాబీ సైనికులందరూ కనబరిచిన పోరాట స్ఫూర్తికి పేరు పేరునా, ప్రతి ఒక్కరికీ శిరస్సువంచి సలాం చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. గెలుపు-ఓటములతో నిమిత్తం లేకుండా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు కనబరిచిన కదనోత్సాహం.. రాష్ట్రస్థాయి నాయకత్వంలో మాటలకందని స్ఫూర్తిని నింపిందని చెప్పారు. రాష్ట్ర ప్రజల పక్షాన గులాబీ సైనికులు విరామం ఎరుగని పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన తుగ్లక్ పాలనతో ఇబ్బందులు పడుతున్న అన్ని వర్గాల పక్షాన అలుపెరుగని పోరాటం చేస్తున్న గులాబీ శ్రేణులను ఆయన అభినందించారు. రైతన్నలు, నేతన్నలు, బడుగు బలహీనవర్గాలు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పక్షాన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సమరభేరి మోగించారని కొనియాడారు. నిరుద్యోగుల హక్కుల కోసం కాంగ్రెస్ సర్కారును నిలదీసి, ఆరు గ్యారెంటీల గారడీని ప్రజాక్షేత్రంలో ఎండగట్టిన పార్టీ శ్రేణులను ఆయన అభినందించారు.

ప్రజల గుండెచప్పుడై...

'మూసీలో మూటల వేట నుంచి లగచర్ల దాకా అన్యాయం జరిగిన ప్రతి చోటా బాధితుల పక్షాన మీరు కొట్లాడారు. తెలంగాణ ప్రజల గుండెచప్పుడును అడుగుడుగునా మీరు ప్రతిధ్వనింపజేశారు' అని కేటీఆర్ పార్టీ శ్రేణులను కొనియాడారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేందుకు పార్టీ చేసిన పోరాటాలు.. చరిత్రపై చెరగని సంతకాలుగా నిలుస్తాయన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను అత్యంత సమర్థంగా తిప్పికొట్టిన సందర్భాలు పోరాటపథంలో నిలిచి ఉండే మైలురాళ్లు అని ఆయన అభివర్ణించారు. అసమర్థ, అనాలోచిత కాంగ్రెస్ విధానాలపై తెలంగాణ ప్రజల కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా బీఆర్ఎస్ శ్రేణులు మోగించిన 'జంగ్' సైరన్ ముఖ్యమంత్రికి ముచ్చెమటలు పట్టించిందని గుర్తుచేశారు.

అలుపెరుగని పోరాటాలతో...

గులాబీ సైన్యం సాగించిన అలుపెరగని పోరాటాల వల్లే అదానీ ఆశజూపిన రూ.100 కోట్లను ప్రభుత్వం వెనక్కి ఇవ్వాల్సి వచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. లగచర్ల గిరిజనుల వేదన దేశం ముందు కాంగ్రెస్ నియంతృత్వాన్ని ఎండగట్టిందని చెప్పారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిలా మార్చే కాంగ్రెస్ కుట్రలను అడుగడుగునా ప్రశ్నిద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'పార్టీకి పునాది రాళ్లు శ్రేణులే. పార్టీ జెండాకు వెన్నెముక మీరే' అని కేటీఆర్ స్పష్టం చేశారు. రేపటి తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై బీఆర్ఎస్ పక్షాన మెరిసే వజ్రాయుధాలు శ్రేణులేనని కొనియాడారు.

టాప్ 2గా 'సీఈవో తెలంగాణ'

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) తెలంగాణ సోషల్ మీడియాకు దేశవ్యాప్తంగా రెండోస్థానం దక్కింది. మొదటి స్థానంలో జార్ఖండ్ ఉన్నది. ఎన్నికల ప్రచారం, అపోహలు తొలిగించుకోవడం, పలు అంశాలపై సోషల్ మీడియాను సమర్థవంతంగా వాడుకున్నట్టు సీఈవో తెలంగాణ తెలిపారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం స్టాటిస్టికల్ నివేదికలో ఈ విషయం గురించి వెల్లడించినట్టు పేర్కొంది.

హైదరాబాద్ నుంచి 8 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ నుంచి ఎనిమిది ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్టు గురువారం రైల్వే అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి గోరక్‌పూర్, జైపూర్, సికింద్రాబాద్ నుంచి అగర్తలా, కాచిగూడ నుంచి బికనేర్ మధ్య రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 3 నుంచి 10 వరకు షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక రైళ్లు నడుస్తాయని అధికారులు తెలిపారు.

శ్రీశైలం విద్యుత్తు కేంద్రానికి ముప్పు లేదు

చీఫ్ ఇంజినీర్ రామసుబ్బారెడ్డి

దోమలపెంట, జనవరి 2 : శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రానికి ముప్పు లేదని.. సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని నమ్మొద్దని చీఫ్ ఇంజినీర్ రామసుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజులుగా వస్తున్న నీటిధారతో పవర్ హౌస్‌కు ప్రమాదమేమీ లేదని చెప్పారు. జల విద్యుత్తు కేంద్రంలో నీటి ఊట రావడం సాధారణమని తెలిపారు. యూనిట్-1కు సంబంధించిన డ్రాఫ్ట్ ట్యూబ్ వద్ద నీటి లీకేజీ కొనసాగుతున్నట్టు డిసెంబర్ 25న గుర్తించి వెంటనే సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు అధికారులు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

ఆర్టీసీ 'సహకార సంఘం' దివాలా!

- ఉద్యోగుల, కార్మికులకు అప్పలభారం
- పాడుపు నిధులు వాడుకున్న యాజమాన్యం
- లోన్లు మంజూరుకాక ప్రైవేటు అప్పలపాలు
- కార్మికుల ఆగ్రహం.. కోర్టును ఆశ్రయించే యోచన

హైదరాబాద్, జనవరి 2 (నమస్తేతెలంగాణ): జాతీయస్థాయిలో ఒకనాడు ఉత్తమ గుర్తింపు పొందిన ఆర్టీసీ సహకార పరపతి సంఘం (సీసీఎస్).. నేడు దివాలా దశకు చేరుకున్నది. కార్మికుల జీతం నుంచి సమకూర్చిన సొమ్ము నుంచి వారి అవసరాల కోసం అప్పులుగా ఇస్తూ ఆదుకున్న సంఘం నేడు తిరోగమనంలో పయనిస్తున్నది. దీంతో సంస్థలోని ఉద్యోగుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. పిల్లల చదువుల కోసం కొందరు, పెళ్లిళ్ల కోసం మరికొందరు, అనారోగ్య సమస్యలతో ఇంకొందరు, ఇతర కుటుంబ అవసరాల కోసం మరెందరో లోన్ కోసం సీసీఎస్‌లో దరఖాస్తు చేసుకుంటే నిధులు లేవని తేల్చి చెప్తున్నారు. సిబిల్ స్కోర్ సరిగా లేదన్న కారణంతో బ్యాంకులు రుణాలను నిరాకరిస్తున్నాయి. దీంతో తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు ఫైనాన్షియర్ల వద్ద అధిక వడ్డీలకు ఆర్టీసీ ఉద్యోగుల, కార్మికులు అప్పులు చేస్తున్నారు. వచ్చే జీతంలో ఇంటి ఖర్చులుపోగా మిగతా సొమ్ము వడ్డీలకే సరిపోవడం లేదని, కుటుంబాలు ఆగమవుతున్నాయని ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులు రూ.లక్షకు నెలకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. తాము ప్రతినెలా జీతంలో 7 శాతం కోత పెట్టుకొని నిధిని సమకూర్చుకుంటే.. తమకే రుణాలు అందక ఇలా అప్పుల బారినపడటం దారుణమని వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి బకాయిలు వచ్చే వరకు లోన్ దొరికే పరిస్థితి లేదని, తొలుత రిటైర్మెంట్ కేసులను పరిష్కరించాకే లోన్ చెల్లింపులు ఉంటాయని సమాధానం ఇస్తున్నారు. దీంతో అప్పటిదాకా ఎదురుచూసే పరిస్థితి లేక, వెంటనే అప్పు పుట్టక ప్రైవేటు అప్పులు తెచ్చుకోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు.

పరపతి సంఘం నిధి విధి ఇదే!

ఆర్టీసీలోని సహకార పరపతి సంఘానికి ఆర్టీసీ ఉద్యోగుల జీతాల్లో ప్రతినెలా 7 శాతం మొత్తం జమ చేయడం ద్వారా నిధి ఏర్పడుతుంది. అందులోంచే ఉద్యోగులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తారు. దాదాపు రూ.3 వేల కోట్ల నిధితో వేల సంఖ్యలో ఉద్యోగులకు రుణాలు ఇస్తూ, కార్మికులను ఆదుకునే సంస్థగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తోపాటు పలు పురస్కారాలను దక్కించుకున్నది. కానీ ఆర్టీసీ కొన్నేండ్లుగా ఈ నిధిని సొంతానికి వాడేసుకుని ఖాళీ చేసింది. ప్రస్తుతం వడ్డీతో కలిపి రూ.900 కోట్లకు పైగా సీసీఎస్‌కు ఆర్టీసీ చెల్లించాల్సి ఉన్నది.

రుణాల కోసం 7 వేల మంది ఎదురుచూపు

సీసీఎస్‌లో నిధులు లేక ఆర్టీసీ ఉద్యోగులకు లోన్లు అందని పరిస్థితి నెలకొన్నది. దీంతో సీసీఎస్ గతంలో హైకోర్టును ఆశ్రయించగా, బకాయిలు చెల్లించాలని ఆర్టీసీని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు గత జూన్‌లో సీసీఎస్‌కు రూ.200 కోట్లు అందాయి. మరో రూ.150 కోట్లు బ్యాంకు నుంచి రుణం తెచ్చింది. ఈ మొత్తం నుంచి ఉద్యోగులకు ఉద్యోగులకు లోన్లు ఇచ్చింది. జూన్ వరకు పేరుకుపోయిన దరఖాస్తులకు ఊరట లభించింది. ఆ తర్వాత బకాయిల చెల్లింపు లేక లోన్ దరఖాస్తులు పేరుకుపోయాయి. ప్రస్తుతం 7 వేల మంది రుణాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో 40 వేల మంది ఉద్యోగులుంటే.. అందులో దాదాపు సగం మంది వరకు వివిధ అవసరాల కోసం సీసీఎస్ రుణాలపై ఆధారపడుతుంటారు.

కోర్టును ఆశ్రయించే యోచన

ఉద్యోగుల ఒత్తిడిని భరించలేక బకాయిలు చెల్లించాలంటూ కొన్ని రోజులుగా సీసీఎస్ యంత్రాంగం ఆర్టీసీపై ఒత్తిడి పెంచుతున్నది. కనీసం బ్యాంకు నుంచి పొందేందుకు పూచీకత్తు అయినా ఇవ్వాలని కోరుతున్నది. కానీ, ఆర్టీసీ యాజమన్యం నుంచి సానుకూలత రావడం లేదు. సీసీఎస్ బకాయిలు చెల్లించాలని ఇప్పటికే హైకోర్టు ఆదేశించి ఉన్నందున.. మళ్లీ తలుపుతట్టి, కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేయాలని సీసీఎస్ యంత్రాంగం భావిస్తున్నట్టు తెలిసింది.

రెండ్రోజుల్లో మంత్రుల అవినీతి బయటపెడతా

- రాష్ట్రంలో రూ.వేల కోట్ల కుంభకోణాలు
- బీజేఎల్పీనేత మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 2(నమస్తే తెలంగాణ): రాష్ట్రప్రభుత్వ, మంత్రుల అవినీతిని రెండ్రోజుల్లో బయటపెడతానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రకటించారు. గురువారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రూ.వేల కోట్ల కుంభకోణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తన వద్ద ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిందని, గతేడాది ఎగవేతల నామ సంవత్సరంగా ముగిసిందని చెప్పారు. కొత్త ఏడాదిలో అయినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 28న రైతు కూలీలకు రూ.12వేలు వేస్తామని స్వయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారని గుర్తు చేశారు. గడువు ముగిసినా డబ్బులు వేయకుండా ఆయనను అడ్డుకున్నది ఎవరో చెప్పాలని ప్రశ్నించారు. ఆ డబ్బులు కాంట్రాక్టర్లకు ఇచ్చేందుకు దాచారా? అని ప్రశ్నించారు. శనివారం జరిగే కేబినెట్ భేటీలో రైతు భరోసాపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని, ఎప్పటిలోగా ఇస్తారో తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1,38,117 కోట్ల అప్పు తెచ్చిందని స్పష్టం చేశారు. ఇందులో రూ.20 వేల కోట్లను రుణమాఫీకి వాడి, మిగతా రూ.1.18 లక్షల కోట్లను బడా కాంట్రాక్టర్లకు చెల్లించారని తెలిపారు. కమీషన్ల కోసం సామాన్యులను ఇబ్బందులు పెడుతున్నారా? అని విమర్శించారు.

రూల్స్ ఉల్లంఘించిన ఆఫీసర్లపై చర్యలు తీసుకోండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం ఖుదాబక్షపల్లి గ్రామంలో శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం కోసం భూసేకరణకు చట్ట నిబంధనలను అమలు చేయని రెవెన్యూ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అధికారులపై తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ టీ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈ మొత్తం ప్రక్రియలో అధికారులు చేతివాటం ప్రదర్శించారని, ప్రాజెక్టు కోసం సేకరించిన తన భూమికి పరిహారం చెల్లించాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన రాళ్ల శ్రీనివాసాచారి పిటిషన్ దాఖలుచేశారు. నోటిఫికేషన్ జారీ తర్వాత ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న పిటిషనర్ భూమిలో గ్రామ పంచాయతీ, మండల అధికారుల అనుమతితో నిర్మాణాన్ని చేపట్టారని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. నోటిఫికేషన్ అమల్లో ఉండగానే అధికారులు నిర్మాణానికి ఎలా అనుమతి ఇస్తారని హైకోర్టు ప్రశ్నించింది. చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. పిటిషనర్ భూమి కోర్టు వివాదంలో ఉండగా ఆ భూముల్లో ఏ విధంగా నిర్మాణాలకు అనుమతులు ఇస్తారని ఆగ్రహం వ్యక్తంచేసింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

మైనారిటీ బంధు గాయబ్..!

- రూ.లక్ష ఆర్థిక సాయంపై సందిగ్ధత
- చెక్కులు మంజూరైనా ఇవ్వని ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అటకెక్కిస్తున్నది. ఇప్పటికే దళితబంధు, బీసీ బంధు పథకాలకు తిలోదకాలిచ్చిన ప్రభుత్వం.. మైనారిటీ బంధును బంద్ పెట్టినట్టు తెలుస్తున్నది. మంజూరైన చెక్కులను అందివ్వకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

పేదరిక నిర్మూలన లక్ష్యంగా

నిరక్షరాస్యత, పేదరికం కారణంగా అత్యధిక మంది మైనారిటీలు చేతివృత్తులు, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మైనారిటీల ఆర్థిక స్వావలంబన కోసం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయాలని అప్పటి కేసీఆర్ సర్కార్ నిర్ణయించింది. చిరువ్యాపారులు, చేతివృత్తిదారులకు ఆర్థిక చేయూతనందించి పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీ పథకాన్ని కేసీఆర్ ప్రారంభించారు. తొలుత మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ఎకనమిక్ సపోర్ట్ పథకం కింద అర్హులైనవారికి బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా సాయం అందించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి 2.16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో తొలి విడతలో జనాభా ప్రాతిపదికన జిల్లాలవారీగా లక్కీడ్రా పద్ధతిలో దాదాపు 11 వేల మందికిపైగా లబ్ధిదారులను గుర్తించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 4,500 మందికి, మిగిలిన జిల్లాల్లో 6,500 మందికి చెక్కులను మంజూరు చేశారు. చాలామంది లబ్ధిదారులకు చెక్కులను గత బీఆర్ఎస్ సర్కార్ అందించింది.

కాళ్లరిగేలా తిరుగుతున్నా..

ఎన్నికల కారణంగా గ్రేటర్‌తో పాటు, వివిధ జిల్లాల్లో కొన్ని చెక్కుల పంపిణీ నిలిచిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని అటకెక్కించింది. అధికారంలోకి వచ్చి ఏడాది అయినా తొలివిడతలో ఎంపికైన లబ్ధిదారులకు చెక్కులను మంజూరు చేయడం లేదు. దీంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అన్ని పథకాల తరహాలోనే మైనారిటీ బంధును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చిందని లబ్ధిదారులు, మైనారిటీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మంజూరైన చెక్కులను విడుదల చేయాలని, యథావిధిగా మైనారిటీ బంధును కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ ఎదుట సమ్మె చేస్తున్న సీఆర్టీలు

14వ రోజుకు సీఆర్టీల దీక్షలు

పీజీహెచ్ఎంటీడబ్ల్యూ అసోసియేషన్ మద్దతు

భద్రాచలం, జనవరి 2 : కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీలు) తమ డిమాండ్లు పరిష్కరించాలని భద్రాచలం ఐటీడీఏ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు గురువారం 14వ రోజుకు చేరాయి. పీజీహెచ్ఎంటీడబ్ల్యూ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భద్రు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, మహిళా అధ్యక్షురాలు నాగమణి, చందు, మోతీరా, కేవీ వెంకటరమణ, బుచ్చిరాములు, బావ్‌సింగ్, మహాలక్ష్మి, వీరభద్రమ్మ, సరస్వతి, చంద్రకళ, నాగరాజు, పద్మ మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన మినిమం టైమ్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

- శివలింగంపై నాగుపాము..వీడియో వైరల్

లక్ష్మణచాంద, జనవరి 2 : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం మల్లాపూర్ శివాలయం గర్భగుడిలోకి గురువారం పాము వచ్చింది. శివలింగం ఎక్కి తిరుగుతున్న దృశ్యాలను అక్కడున్న భక్తులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

జలకళ.. వెలవెల

నాడు కేసీఆర్ పాలనలో మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల పరిధిలో పాలేరు వాగు నీటితో కళకళలాడి మండుటెండల్లోనూ చెక్‌డ్యాంలు మత్తడి పోశాయి. నేడు కాంగ్రెస్ హయాంలో పాలేరు వాగులో నీరు ఎండిపోయి, ఇసుక దిబ్బలు తేలి వెక్కిరిస్తున్నాయి. యాసంగికి ముందే నీరు ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. - దంతాలపల్లి

ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ పోలీస్ చీఫ్ మృతి

టెల్ అవీవ్: గాజాలో హమాస్ ఉగ్రవాద సంస్థ నిర్వహిస్తున్న పోలీసు విభాగానికి గట్టి దెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ వైమానిక దాడిలో పోలీస్ చీఫ్ మహమూద్ సలాహ్, డిప్యూటీ చీఫ్ హుస్సమ్ షహ్వాన్ మరణించారు. ఐడీఎఫ్ ప్రకటించిన మానవతావాద ప్రాంతం ఖాన్ యూనిస్‌లో నిర్వాసితులకు ఆశ్రయం కల్పించిన టెంట్‌పై జరిగిన దాడిలో వీరు ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరి మరణాలను ఇజ్రాయెల్ సైన్యం ధ్రువీకరించింది. వీరు సాధారణ ప్రజల మధ్య దాక్కున్నారని తెలిపింది. వీరితోపాటు 11 మంది సాధారణ పౌరులు కూడా మరణించారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు